రాహుల్ అట్టర్ ఫ్లాప్

రెండో ఇన్నింగ్స్‌లోనూ విఫలం • భారత్ 'ఏ' రెండో ఇన్నింగ్స్ 73/5

రాహుల్ (10)

మెల్‌బోర్న్: ఫామ్‌లేమితో సతమతమవుతున్న టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా తుది జట్టులో చోటు దక్కించుకోవడం ఇక అనుమానంగానే కనిపిస్తున్నది! ఆస్ట్రేలియా 'ఏ'తో జరుగుతున్న అనధికారిక రెండో టెస్టులో అతడు వరుస ఇన్నింగ్స్‌లలో అట్టర్ ఫ్లాఫ్ అయ్యాడు. తొలి ఇన్నింగ్స్‌లో 4 పరుగులే చేసిన రాహుల్.. సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ 44 బంతులాడి 10 పరుగులే చేసి క్లీన్ బౌల్డ్ అయ్యాడు. ఇక మ్యాచ్ విషయానికొస్తే రెండో ఇన్నింగ్స్‌లో భారత టాపార్డర్ మరోసారి కుప్పకూలింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 31 ఓవర్లలో 73 పరుగులే చేసి ఐదు కీలక వికెట్లు కోల్పోయింది. ఫస్ట్ ఇన్నింగ్స్ హీరో ధ్రువ్ జురెల్ (19 నాటౌట్), నితీశ్ రెడ్డి (9 నాటౌట్) క్రీజులో ఉన్నారు. అంతకుముందు ఆస్ట్రేలియా 'ఏ' తొలి ఇన్నింగ్స్‌లో 223 పరుగులకు ఆలౌట్ అయింది. మార్కస్ హారిస్ (74) అర్ధ సెంచరీతో మెరిశాడు. భారత బౌలర్లలో ప్రసిధ్ కృష్ణ (4/50), ముకేశ్ కుమార్ (3/41) రాణించారు.

రవూఫ్ పాంచ్ పటాకా

ఆసీస్‌పై పాక్ ఘన విజయం


రౌఫ్ (5/29)

అడిలైడ్: ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న పాకిస్థాన్ తొలి వన్డేలో ఓటమిపాలైనా శుక్రవారం జరిగిన రెండో వన్డేలో 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి సిరీస్‌ను 1-1తో సమం చేసింది. ప్రఖ్యాత అడిలైడ్ ఓవల్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో పాక్ పేసర్ హరీస్ రౌఫ్ (5/29) బంతితో నిప్పులు చెరగగా షహీన్ షా అఫ్రిది (3/26) మెరవడంతో మొదట బ్యాటింగ్ చేసిన ఆసీస్ 35 ఓవర్లలో 163 పరుగులకే ఆలౌట్ అయింది. స్టీవ్ స్మిత్ (35) టాప్ స్కోరర్. స్వల్ప లక్ష్యాన్ని పాక్ 26.3 ఓవర్లలోనే పూర్తిచేసింది. యువ ఓపెనర్ సయీమ్ అయూబ్ (82), అబ్దుల్లా షఫీక్ (64 నాటౌట్) తొలి వికెట్‌కు 137 పరుగులు జోడించి పాక్‌కు అలవోక విజయాన్ని అందించారు. ఇరు జట్ల మధ్య నిర్ణయాత్మక మూడో వన్డే ఆదివారం పెర్త్ వేదికగా జరుగనుంది. ఆస్ట్రేలియా గడ్డపై పాక్‌కు ఏడేండ్ల తర్వాత ఇదే తొలి విజయం కావడం విశేషం.

రాజస్థాన్ దీటుగా..

జైపూర్: హైదరాబాద్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్- బీ మ్యాచ్‌లో రాజస్థాన్ దీటుగా బదులిచ్చింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 425 పరుగులకు ఆలౌట్ అయింది. మహిపాల్ లోమ్రర్ (111), శుభమ్ గర్వాల్ (108) సెంచరీలతో కదంతొక్కగా జుబేర్ అలీ (57) అర్ధ సెంచరీ సాధించడంతో ఆ జట్టు ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 15 పరుగుల స్వల్ప ఆధిక్యం సాధించింది. హైదరాబాద్ బౌలర్లలో తనయ్ త్యాగరాజన్ (3/104) ఫర్వాలేదనిపించాడు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి హైదరాబాద్ వికెట్ నష్టపోకుండా 36 రన్స్ చేసి 21 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతున్నది.

అంధుల క్రికెట్ టోర్నీలో విజేతగా నిలిచిన వారియర్స్ వుమెన్స్ టీమ్. శుక్రవారం విజేతలకు ప్రవీణ్‌కుమార్, టీడీసీఏ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి ట్రోఫీ ప్రదానం చేశారు

శాంసన్ ధనాధన్

ప్రధాన ఆటగాళ్ల పనిభారం నిర్వహణలో వరుస అవకాశాలు దక్కించుకుంటున్న వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్.. టీ20 క్రికెట్‌లో ఇప్పటిదాకా మరే భారత క్రికెటర్‌కు సాధ్యం కాని రీతిలో బ్యాక్ టు బ్యాక్ సెంచరీలతో విరుచుకుపడటంతో దక్షిణాఫ్రికా పర్యటనలో యువ భారత్ బోణీ కొట్టింది. సంజూ, తిలక్ వర్మ దూకుడుతో భారీ స్కోరుచేసిన టీమ్‌ఇండియా.. ప్రత్యర్థిని కట్టడిచేయడంలోనూ విజయవంతమైంది. స్పిన్నర్లు వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్ సఫారీలకు చుక్కలు చూపించారు.

వరుసగా రెండో శతకం బాదిన సంజూ • రాణించిన తిలక్ వర్మ
స్పిన్నర్ల ధాటికి సఫారీలు విలవిల • తొలి టీ20లో భారత్ ఘనవిజయం

శాంసన్ (107)

కింగ్స్‌మీడ్ (డర్బన్): టీమ్‌ఇండియా వికెట్ కీపర్ సంజూ శాంసన్ (50 బంతుల్లో 107, 7 ఫోర్లు, 10 సిక్సర్లు) శతకంతో కదంతొక్కడంతో దక్షిణాఫ్రికా పర్యటనలో యువ భారత్ బోణీ కొట్టింది. కింగ్స్‌మీడ్ మైదానం వేదికగా ముగిసిన తొలి టీ20లో భారత్ 61 పరుగుల తేడాతో సఫారీలను ఖంగుతినిపించి నాలుగు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలో నిలిచింది. శాంసన్‌తో పాటు తిలక్ వర్మ (18 బంతుల్లో 33, 3 ఫోర్లు, 2 సిక్సర్లు) వేగంగా ఆడటంతో మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 202 పరుగులు చేసింది. సౌతాఫ్రికా బౌలర్లలో గెరాల్డ్ కొయెట్జి (3/37) రాణించాడు. అనంతరం భారీ ఛేదనలో సఫారీలు.. భారత స్పిన్నర్ల ధాటికి 17.5 ఓవర్లలో 141 పరుగులకే పరిమితమయ్యారు. హెన్రిచ్ క్లాసెన్ (25) టాప్ స్కోరర్. వరుణ్ (3/25), బిష్ణోయ్ (3/28) దక్షిణాఫ్రికాను కట్టడిచేశారు. సంజూ శాంసన్‌కే 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

శాంసన్..మళ్లీ దంచెన్!

టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన భారత్ ఆది నుంచే వేగంగా ఆడేందుకు యత్నించింది. ఈ వ్యూహాన్ని శాంసన్ పకడ్బందీగా అమలుచేయగా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ (7) మరోసారి నిరాశపరిచాడు. మార్క్‌రమ్ 4వ ఓవర్లో బౌండరీతో పరుగుల వేట మొదలుపెట్టిన సంజూ.. మహారాజ్ 3వ ఓవర్లో 4, 6తో అతడికి స్వాగతం పలికాడు. క్రీజులోకి రావడంతోనే ఫోర్, సిక్సర్ బాదిన సూర్యకుమార్ యాదవ్ (17 బంతుల్లో 21, 2 ఫోర్లు, 1 సిక్స్) అండతో సంజూ మరింత రెచ్చిపోయాడు. జాన్సెన్ 5వ ఓవర్లో 4,6,4 బాదడంతో తొలి పవర్ ప్లే ముగిసేసరికి భారత్ స్కోరు 56/1 చేరింది. ఎంగబా పీటర్ 8వ ఓవర్లో రెండు వరుస సిక్సర్లతో 27 బంతుల్లోనే సంజూ అర్ధ శతకం పూర్తయింది. క్రూగర్ 9వ ఓవర్లో ఆఖరి బంతికి సూర్య ఔట్ అవడంతో 37 బంతుల్లోనే 66 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. సిమలెన్ 13వ ఓవర్లో రెండు బౌండరీలు, లాంగాఫ్ వద్ద ఓ భారీ సిక్సర్‌తో 90లలోకి వచ్చిన శాంసన్.. మహారాజ్ 15వ ఓవర్లో సింగిల్ తీసి వరుసగా రెండో శతకాన్ని పూర్తిచేసుకున్నాడు. 47 బంతుల్లోనే అతడి శతకం పూర్తయింది. క్రీజులో ఉన్నంతసేపు మెరుపులు మెరిపించిన తిలక్.. ఇదే ఓవర్లో భారీ షాట్ ఆడబోయి డీప్ స్క్వేర్ లెగ్ వద్ద జాన్సెన్ చేతికి చిక్కాడు. ఆ మరుసటి ఓవర్లో శాంసన్ సైతం పీటర్ బౌలింగ్‌లో స్టబ్స్ చేతికి చిక్కాడు. శాంసన్ ఔట్ అయ్యేటప్పటికీ 16 ఓవర్లలో 175/4గా ఉన్న భారత స్కోరు ఒక దశలో 250 దాకా వెళ్తుందని అభిమానులు ఆశించినా చివరి 4 ఓవర్లలో 27 పరుగులే చేసింది.

స్పిన్ మాయకు విలవిల

కొండంత లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో సౌతాఫ్రికాకు ఆరంభం నుంచే కష్టాలు తప్పలేదు. ఆరంభంలో పేసర్లు, మధ్య ఓవర్లలో స్పిన్నర్లు సఫారీలను కట్టడిచేశారు. తొలి ఓవర్లోనే రెండు ఫోర్లు కొట్టిన మార్క్‌రమ్ (8) అర్ష్‌దీప్ బౌలింగ్‌లో సంజూకు క్యాచ్ ఇచ్చాడు. అవేశ్ ఖాన్ 4వ ఓవర్లో ప్రమాదకర ట్రిస్టన్ స్టబ్స్ (11)ను పెవిలియన్‌కు పంపాడు. 3 పోర్లు, ఓ సిక్సర్‌తో 11 బంతుల్లోనే 21 రన్స్ రాబట్టిన రికెల్టన్.. వరుణ్ చక్రవర్తి 6వ ఓవర్లో లాంగాన్ వద్ద తిలక్ వర్మ చేతికి చిక్కాడు. ఈ క్రమంలో క్లాసెన్, మిల్లర్ ఆ జట్టును ఆదుకున్నారు. 4 వికెట్‌కు ఈ ద్వయం 42 రన్స్ జతచేశారు. చక్రవర్తి ఒకే ఓవర్లో ఈ ఇద్దరినీ ఔట్ చేసి సఫారీలను కోలుకోలేని దెబ్బతీశాడు. మరుసటి ఓవర్లో బిష్ణోయ్ కూడా క్రూగర్ (1), సిమలెన్ (6)ను పెవిలియన్‌కు పంపాడు. జాన్సెన్ (12)ను బిష్ణోయ్ ఔట్ చేయడంతో సఫారీల ఓటమి ఖరారైంది.

1- పొట్టి ఫార్మాట్‌లో భారత్ తరఫున రెండు శతకాలు చేసిన ఏకైక వికెట్ కీపర్ బ్యాటర్ శాంసన్.

2- క్యాలెండర్ ఈయర్‌లో ఏడు సార్లు 200 ప్లస్ స్కోరు చేయడం భారత్‌కు ఇది వరుసగా రెండోసారి.

4 - టీ20లలో వరుసగా రెండు శతకాలు చేసిన ఆటగాళ్లలో శాంసన్ నాలుగోవాడు. గుస్తవ్ మెక్‌కియోన్, రిలీ రూసో, ఫిల్ సాల్ట్.. సంజూ కంటే ముందున్నారు. భారత్ నుంచి ఈ ఘనత సాధించింది అతడొక్కడే.

సంక్షిప్త స్కోర్లు

భారత్ : 20 ఓవర్లలో 202/8 (శాంసన్ 107, తిలక్ 33, కొయెట్జి 3/37, జాన్సెన్ 1/24) **దక్షిణాఫ్రికా:** 17.5 ఓవర్లలో 141 (క్లాసెన్ 25, రికెల్టన్ 21, వరుణ్ 3/25, బిష్ణోయ్ 3/28)

ఆరు గంటల పాటు రివ్యూ..

కివీస్ సిరీస్ ఓటమిపై బీసీసీఐ సుదీర్ఘ భేటీ

న్యూఢిల్లీ: న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌లో భారత్ వైట్‌వాష్‌కు గురికావడంపై బీసీసీఐ ప్రత్యేకంగా దృష్టి సారించింది. సొంతగడ్డపై ఎప్పుడూ లేని రీతిలో తొలిసారి సిరీస్ క్లీన్ స్వీప్ ఎదుర్కొనడాన్ని బోర్డు సిరీయస్‌గా తీసుకుంది. ఇందులో భాగంగా అధ్యక్షుడు రోజర్ బిన్నీ, కార్యదర్శి జై షా..టీమ్‌ఇండియా చీఫ్ కోచ్ గంభీర్, కెప్టెన్ రోహిత్‌శర్మ, చీఫ్ సెలెక్టర్ అగార్కర్‌తో శుక్రవారం ఏకంగా ఆరు గంటల పాటు సమావేశమైంది. కివీస్‌తో టెస్టు సిరీస్ సందర్భంగా టీమ్ మేనేజ్‌మెంట్ తీసుకున్న నిర్ణయాలపై బోర్డు పెద్దలు ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ భేటీకి కోచ్ గంభీర్ ఆన్‌లైన్ ద్వారా హాజరయ్యాడు. ముంబైలో జరిగిన మూడో టెస్టులో బుమ్రాకు విశ్రాంతి నివ్వడంతో పాటు స్పిన్ వికెట్‌ను ఎందుకు ఎంపిక చేసుకోవాల్సి వచ్చిందని ప్రశ్నించినట్లు బోర్డు వర్గాలు పేర్కొన్నాయి. కీలకమైన ఆస్ట్రేలియాతో సిరీస్‌కు ముందు జట్టు తిరిగి ఎలా గాడిలో పడుతుందన్న దానిపై వివరణ అడిగినట్లు సమాచారం.

ఫైనల్లో పంకజ్

న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక ఐబీఎస్ఎఫ్ ప్రపంచ బిలియర్డ్స్ టోర్నీలో భారత స్టార్ క్యూయిస్టు పంకజ్ అద్వానీ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. తద్వారా 28వ ప్రపంచ టైటిల్‌కు పంకజ్ మరింత చేరువయ్యాడు. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో పంకజ్ 4-2 తేడాతో భారత్‌కే చెందిన సౌరవ్ కొఠారిపై విజయం సాధించాడు. ఆది నుంచే తనదైన దూకుడు కనబరిచిన ఈ స్టార్ క్యూయిస్టు తొలి గేమ్‌ను కైవసం చేసుకున్నాడు. రెండో గేమ్‌ను సౌరవ్ సొంతం చేసుకోగా, వరుసగా రెండు గేములు గెలిచి పంకజ్ 3-1 ఆధిక్యం కనబరిచాడు. మళ్లీ పుంజుకున్న సౌరవ్ మరో గేమ్ గెలిచి పోటీలోకి రాగా, తన అనుభవాన్ని ఉపయోగించుకుంటూ అద్వానీ విజయాన్ని సొంతం చేసుకున్నాడు. ఫైనల్లో ఇంగ్లండ్‌కు చెందిన రాబర్ట్ హాల్‌తో అద్వానీ తలపడనున్నాడు.

సెమీస్‌కు కిరణ్

ఇక్సాన్: కొరియా మాస్టర్స్‌లో భారత యువ షట్లర్ కిరణ్ జార్జి జోరు కొనసాగుతోంది. ఈ టోర్నీలో ఓటమన్నదే లేకుండా సాగుతున్న అతడు శుక్రవారం జరిగిన పురుషుల క్వార్టర్స్‌లో 21-14, 21-16తో టకుమ ఒబయషి (జపాన్)ను చిత్తు చేశాడు. వరుస గేమ్‌లలో ప్రత్యర్థిని ఖంగుతినిపించిన కిరణ్.. 39 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించాడు. సెమీస్‌లో అతడు ప్రపంచ ఐదో ర్యాంక్ ఆటగాడు కున్లావత్ వితిద్సరన్ (థాయ్‌లాండ్)తో తలపడనున్నాడు.

ఫిట్‌నెస్ కోచ్ డోగ్రా కన్నుమూత

ఢిల్లీ: భారత క్రికెట్ జట్టుకు మొట్టమొదటి ఫిట్‌నెస్ కోచ్‌గా పనిచేసిన కెప్టెన్ కేబీ డోగ్రా (89) కన్నుమూశారు. పదిరోజుల క్రితం ఢిల్లీలోని తన నివాసంలో ఆయన గుండెపోటుతో మరణించినట్టు డోగ్రా కుటుంబసభ్యులు శుక్రవారం వెల్లడించారు. పాతతరం క్రికెటర్లు సునీల్ గవాస్కర్, మోహిందర్ అమర్‌నాథ్, బిషన్‌సింగ్ బేడీ వంటి దిగ్గజాలకు ఆయన ఫిట్‌నెస్ పాఠాలు చెప్పారు. మోహిందర్ అమర్‌నాథ్ ఫిట్‌నెస్‌పై ఎక్కువగా శ్రద్ధ వహించేవారని డోగ్రా పలు సందర్భాలలో చెప్పేవారు. 1970-80 కాలంలో భారత్‌కు ఆడిన చాలా మంది క్రికెటర్లు డోగ్రా వద్ద ఫిట్‌నెస్ పాఠాలు నేర్చుకున్నవారే.

ఆధిక్యంలో అర్జున్

చెన్నై: చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ టోర్నీలో భారత స్టార్ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేసి అర్జున్ జోరు కొనసాగుతున్నది. శుక్రవారం జరిగిన మాస్టర్స్ కేటగిరీలో వరల్డ్ నంబర్2 అర్జున్..అమిన్ తబాట్‌బయిపై గెలిచి టాప్‌లోకి దూసుకెళ్లాడు. నాలుగు రౌండ్‌లు ముగిసే సరికి అర్జున్ 3.5 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. మాక్సిమ్‌తో గేమ్‌ను విదిత్ గుజరాతి, ఆరోనియన్‌తో అరవింద్ గేమ్‌లు డ్రా చేసుకున్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.